మహిళా దినోత్సవం



శబ్దంతో సమస్యను కనిపెట్టా..

2024 అక్టోబర్ 30వ తేదీ రాత్రి 9 గంటలకు విధి నిర్వహణలో భాగంగా గూడ్స్ రైలు తనిఖీ చేస్తుండగా.. రైలు చక్రాల వద్ద ఏదో సమస్య ఉన్నట్లు గుర్తించాను. చక్రాల నుంచి వచ్చే శబ్దాన్ని బట్టి మంటలు వచ్చే అవకాశం ఉందని కనిపెట్టి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాను.. వెంటనే అధికారులు, సిబ్బంది వచ్చి పరిశీలించగా, చక్రాల వద్ద మంటలు ఏర్పడే పరిస్థితి ఉన్నట్లు నిర్ధారించారు. రైలు ముందుకెళ్తే తప్పనిసరిగా పడిపోయే అవకాశం ఉంది. నా సమయస్ఫూర్తితో ప్రమాదం తప్పడంతో జీఎం అవార్డు లభించింది.

– కె.అరుణ, ఎగ్జామినర్, ఈస్ట్‌కోస్ట్ రైల్వే, విజయనగరం.



రెండింటినీ బ్యాలెన్స్ చేస్తున్నా...



ఓ వైపు కుటుంబం.. మరో వైపు ఉద్యోగం.. రెండింటినీ బ్యాలెన్స్ చేసుకుంటూ వస్తున్నాను. కుటుంబాన్ని పోషించే భర్త దూరమవ్వడంతో 2015లో రైల్వేలో ఉద్యోగం వచ్చింది. గూడ్స్ రైలుకి సంబంధించి సుమారు 53 బోగీలను ప్రతిరోజూ తనిఖీ చేయాలి. ఓ సారి విధి నిర్వహణలో ఉండగా రైలు యాక్సిల్ బాక్స్ నుంచి పొగలు రావడం గమనించారు. వెంటనే సమీపంలో ఉన్న అధికారులకు పరిస్థితి వివరించడంతో ప్రమాదం తప్పింది. చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తుండడంతో 2023లో రైల్వే జీఎం అవార్డు వచ్చింది.

– జి.లక్ష్మి, అసిస్టెంట్, రైల్వే సి అండ్ డబ్ల్యూ డిపార్ట్‌మెంట్, విజయనగరం

కరెంట్ కట్‌కటకు చెక్..!

- విద్యుత్ లోడు క్రమబద్ధీకరణకు చర్యలు
- గృహవిద్యుత్ వినియోగదారులకు సదవకాశం
- అదనపు లోడు క్రమబద్ధీకరణకు 50శాతం రాయితీ

బలిజిపేట: దశాబ్దాల క్రితం విద్యుత్ కనెక్షన్ ఉండే ఇంటిలో ఒక బల్బు, ఒక ఫ్యాన్ వినియోగం ఉండేది. ప్రస్తుతం విద్యుత్ పరికరాల వినియోగం పెరగడంతో విద్యుత్ వాడకం బాగా పెరిగింది. దీంతో నాణ్యమైన విద్యుత్ అందుతున్న దాఖలాలు కనిపించడం లేదు. ఫ్యాన్ల స్థానంలో ఏసీలు చేరాయి, వేడినీళ్లకు హీటర్లు, దుస్తులు ఉతికేందుకు వాషింగ్ మెషీన్లు, పిండి రుబ్బడానికి గ్రైండర్, ఇంకా టెక్నాలజీ అభివృద్ధి చెంది మోటార్ సైకిళ్లు, కార్లు సైతం విద్యుత్ ద్వారా పరుగులు పెడుతున్న రోజులు వచ్చాయి. వినియోగించే విద్యుత్‌ను క్రమబద్ధీకరించుకోవాలని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం గృహ విద్యుత్ వినియోగదారులకు అదనపు లోడు క్రమబద్ధీకరణకు 50శాతం రాయితీ కల్పిస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తెలిపింది.

● అదనపు లోడు అంటే:

గృహ విద్యుత్ అవసరాలకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చే సమయంలో వాడే విద్యుత్ దీపాలు, గృహోపకరణాల వినియోగాన్ని అంచనా వేసి అవసరం మేరకు కిలోవాట్‌ల లెక్కన డెవలప్‌మెంట్ చార్జీ, సెక్యూరిటీ డిపాజిట్ కట్టించుకుంటారు. దానికి తగిన విధంగానే ఆయా ప్రాంతాల్లో విద్యుత్ పరివర్తకాలు ఏర్పాటుచేశారు. అయితే అప్పటి అంచనాకు మించి అధిక విద్యుత్ ఉపకరణాలు వాడడం వల్ల విద్యుత్ వినియోగం పెరిగిపోయి తక్కువ లోడు కోసం ఏర్పాటు చేసిన పరివర్తకాలు తరచూ ట్రిప్ కావడంతో లో వోల్టేజ్ సమస్యలు తలెత్తి వినియోగదారులు తరచూ ఇబ్బంది పడుతున్నారు.

క్రమబద్ధీకరణ రాయితీ వివరాలు

అదనపు లోడ్	అసలు ధర(రూ.)	తగ్గింపు ధర(రూ.)
1కిలో వాట్	2,250	1,250
2కిలో వాట్	4,450	2,450
3కిలో వాట్	6,650	3,650
4కిలో వాట్	8,850	4,850
5కిలో వాట్	11,050	6,050

జూన్ 30వ తేదీ వరకు సమీప మీ సేవ కేంద్రంలో కానీ, ఈపీడీసీఎల్ వెబ్‌సైట్ లో కానీ దరఖాస్తు చేసుకుని తగిన చార్జీలు చెల్లించి అదనపు లోడ్‌ను క్రమబద్ధీకరించుకోవాలని విద్యుత్‌శాఖ అధికారులు కోరుతున్నారు.

● 50శాతం రాయితీ

గృహాల్లో పెరిగిన అదనపు లోడు విద్యుత్ వినియోగాన్ని క్రమబద్ధీకరించుకోవడానికి ప్రస్తుతం ప్రభుత్వం 50శాతం రాయితీ కల్పిస్తోంది. గతంలో ఒక కిలోవాట్ అదనపు లోడుకోసం క్రమబద్ధీకరించుకోవడానికి రూ.2వేలు, డెవలప్‌మెంట్ చార్జీ నిమిత్తం రూ.200చెల్లించాల్సి వచ్చేది. ప్రస్తుతం 50శాతం రాయితీతో కేవలం రూ.1,000 చెల్లిస్తే సరిపోతుంది. సెక్యూరిటీ డిపాజిట్‌లో ఎటువంటి మార్పు ఉండదు.

● జూన్ 30 చివరి తేదీ

విద్యుత్ కనెక్షన్ తీసుకున్న నాటికి ఇప్పటికీ విద్యుత్ వినియోగం మూడు నుంచి నాలుగు రెట్లు పెరిగిపోయింది. విద్యుత్ అధికారుల తనిఖీల్లో అదనపు లోడు వినియోగిస్తున్నట్లు గమనిస్తే జరిమానాలు విధించడంతో పాటు లో ఓల్టేజీ వంటి సమస్యలు ఎదుర్కోవలసి ఉంటుంది. దీనికి పరిష్కారంగా అదనపు లోడు క్రమబద్ధీకరించుకోవడం ఉత్తమం. దీనికోసం జూన్ నెల 30వ తేదీ వరకు రాయితీ వర్తించేలా అధికారులు చర్యలు తీసుకున్నారు.



విద్యుత్ మీటర్

వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి

విద్యుత్ నియంత్రణ మండలి కల్పించిన 50శాతం రాయితీని గృహ విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకుని విద్యుత్ లోడు క్రమబద్ధీకరించుకోవడం మంచిది. అన్ని విధాలా వినియోగదారులకు మేలు జరుగుతుంది. మంచి నాణ్యమైన విద్యుత్ అందుతుంది.

– సింహాచలం, ఏఈ, బలిజిపేట

సంతలో మౌలిక సదుపాయాలు కల్పించాలి



వెంగాపురం సంతలో నినాదాలు చేస్తున్న వ్యాపారులు

బలిజిపేట: మండలంలోని వెంగాపురం(బలిజిపేట) గ్రామం వద్ద ఉన్న సంతలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం జిల్లా నాయకుడు రెడ్డి వేణు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ వెంగాపురం సంతకు పూర్వంకాలంలో మంచి పేరు ఉండేదని, పరిసర ప్రాంతాలకు ఇక్కడే పెద్దసంత కూడేదని, అన్ని రకాల వస్తువులు దొరికేవని అటువంటి సంతలో ఇప్పుడు మౌలిక సదుపాయాలు కరువై చిరు వ్యాపారులు వ్యాపారం చేసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంత నిర్వాహకులు ఆసీల రూపంలో డబ్బులు వసూలు చేస్తున్నా వారికి మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలమవుతున్నారని ఆరోపించారు. తాగడానికి మంచినీరు, సరైన రహదారి సదుపాయం లేదు, సంతరోజున వ్యాపారం చేసేందుకు షెడ్లు లేకపోవడంతో సంత సన్నగిల్లుతోందని అన్నారు. షెడ్లు వెంటనే ఏర్పాటు చేసి వ్యాపారులకు మేలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి.భానుమూర్తి, వై.మన్మథరావు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులు పీ4 సర్వే పూర్తి చేయాలి

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో పోవర్టీలో ఉన్న కుటుంబాల(పి4) సర్వే పనులు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయడానికి సచివాలయ ఉద్యోగులంతా సన్నద్ధం కావాలని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు సూచించారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సహాయగణాంక అధికారి సతీష్ అధ్యక్షతన వివిధ శాఖలకు చెందిన సచివాలయ ఉద్యోగులతో శుక్రవారం రెండు విడతల్లో పీ4 సర్వే పనులపై శిక్షణ తరగతులు నిర్వహించారు.సర్వే చేయడంపై సచివాలయ ఉద్యోగులంతా అవగాహన కల్పించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ త్రివిక్రమరావు మాట్లాడుతూ మండలంలోని సచివాలయాల లెక్కల ప్రకారం 19,526 కుటుంబాలున్నాయని, 17,500 కుటుంబాలు నమోదు అయ్యాయని తెలియజేశారు. ఇంతవరకూ చేసిన సర్వే సరిచేస్తూ మిగతా కుటుంబాల వివరాలపై సర్వే చేయాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో మార్చి 8 నుంచి 18వ తేదీ వరకూ సర్వే ప్రక్రియ పూర్తిచేసి నివేదిక సమర్పించాలని కోరారు. సర్వే సమయంలోనే కుటుంబాలకు సంబంధించిన జీవనాధార వనరులు అడిగి తెలుసుకోవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా సిర్లిపోతన్న పండగ



పూజలు అందుకుంటున్న ఆలయంలోని సిర్లిపోతన్న, నాగేంద్రుడు



సీతానగరం: జాతరలో పాల్గొన్న భక్తులు

పార్వతీపురం టౌన్: మన్యం జిల్లా కేంద్రం పార్వతీపురం పట్టణంలోని దుర్గాదేవి వీధిలో ప్రజల ఇలవేల్పు సిర్లి పోతన్న పండగ శుక్రవారం ఘనంగా జరిగింది. ఉదయం 6 గంటలకు సిర్లిపోతన్న పూజారులు సింగరోతు అప్పన్న, శంకరావు, బుచ్చమ్మలు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని సిర్లిపోతన్నతో పాటు నాగేంద్రునికి పూజారులు భక్తులతో పూజలు చేయించారు. నాగేంద్రుని పుట్టమన్ను బొట్టుగా పెట్టుకోవడంతో పాటు ఇప్పలపోలమ్మ, ఎర్రకంచమ్మ, కొత్త పోలమ్మల సోదరుడు పోతన్నను పూజించడం ద్వారా దోషాలు పోతాయని ప్రజలు నమ్ముతారు. పార్వతీపురం, కొమరాడ, కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల నుంచే కాకుండా ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతాల గిరిజన గ్రామాల ప్రజలు పండగకు తరలివచ్చారు.

సీతానగరంలో..

మండలకేంద్రంలో శుక్రవారం జరిగిన సిర్లిపోతన్న ఎల్లమ్మ జాతరలో వేలాదిమంది భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. పెదభోగిలి పంచాయతీ దేవాంగుల వీధిలో జరిగిన సిర్లిపోతన్న ఎల్లమ్మ జాతరకు దూర ప్రాంతాలనుంచి, చుట్టుపక్కల గ్రామాలనుంచి భక్తులు హాజరు కావడంతో ఆలయ ప్రాంగణమంతా కిక్కిరిసి పోయింది. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు సంభవించకుండా ఎస్సై ఎం.రాజేష్ పర్యవేక్షణలో ఏఎస్సై జి.శ్రీనివారావు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

పార్వతీపురంటౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు దాసరి నాగరత్నం పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమె మాట్లాడుతూ మాజీ శాసనసభ్యుడు అలంజగి జోగారావు పిలుపు మేరకు మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉదయం 10 గంటలకు మహిళా దినోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని మండలాల నుంచి, పురపాలక సంఘం నుంచి మహిళా ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

క్లుప్తంగా

ఐదుగురిపై కేసు నమోదు

పార్వతీపురం రూరల్: పట్టణంలోని దేవాంగుల వీధి వద్ద కొంతమంది కుక్కను హింసిస్తున్నారని రాగోలు దుర్గ అనే వ్యక్తి మందలించినందుకు గాను ఆప్రాంతంలోని ఐదుగురు వ్యక్తులు దుర్గపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. గురువారం రాత్రి జరిగిన ఈ సంఘటనపై టౌన్ పోలీస్ స్టేషన్‌లో బాధితుడు దుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐదుగురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ కె.మురళీధర్ తెలిపారు.

వివాహితపై వేధింపులు

పట్టణంలోని పోలీస్‌స్టేషన్ రోడ్డులో నివాసం ఉంటున్న పూసర్ల సురేష్ కుమార్ అదే వీధిలో ఉంటున్న వివాహితను నిత్యం వేధింపులకు గురిచేస్తున్నట్లు బాధిత మహిళ పట్టణ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నేతల విగ్రహాలకు ముసుగు తీసేదెన్నడో?



కృష్ణపల్లిలో నేతల విగ్రహాలకు తొలగించని ముసుగులు

పార్వతీపురం రూరల్: ఎన్నికల కోడ్‌ను ఈనెల 5న ఎత్తివేసినప్పటికీ నాయకుల విగ్రహాలకు వేసిన ముసుగులు తొలగలేదు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఎన్నికల నిబంధనలు అంటూ ఆగమేఘాలపై నేతల విగ్రహాలకు ముసుగులు వేశారు. శంకుస్థాపన, ప్రారంభోత్సవ శిలాఫలకాలు, గ్రామ పంచాయతీల వద్ద ఏర్పాటు చేసిన సూచనల బోర్డులకు సైతం సంబంధిత అధికారులు ముసుగులు వేయించారు. ఎన్నికల కోడ్ తొలగించి మూడు రోజులు గడుస్తున్నా నాయకుల విగ్రహాలకు వేసిన ముసుగులు తొలగించకపోవడంతో అధికారుల తీరుపై పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విగ్రహాలకు ముసుగులు తొలగించాలని కోరుతున్నారు.

15 నుంచి రామమందిర ప్రథమవార్షికోత్సవం

పార్వతీపురం రూరల్: పట్టణ శివారులోని వసుంధర నగర్‌లో గల శ్రీ సీతారామ మందిర ప్రథమ వార్షికోత్సవం ఈనెల 15,16 తేదీల్లో నిర్వహించనున్నట్లు మందిర కమిటీ సభ్యులు పేర్కొన్నారు. వార్షికోత్సవంలో భాగంగా ఈనెల 15న పుణ్యాహవాచనం, మంటపారాధన, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు తదితర కార్యక్రమాలను అలయ పురోహితులు పీవీఎస్ ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించి 16న ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన చేయనున్నట్లు తెలిపారు. స్వామివారి పూజల్లో భక్తులు అధికంగా పాల్గొనాలని కోరారు.

ఖాతాదారుల ఆరోగ్యమే లక్ష్యం

- స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ సాహు



ఉచిత ఆరోగ్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ దత్తా

పార్వతీపురంటౌన్: ఖాతాదారుల ఆరోగ్యమే తమ లక్ష్యమని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ బీబీ సాహు అన్నారు. ఈ మేరకు శుక్రవారం అంతర్జాతీయ మహిళ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రధాన ఎస్‌బీఐ కార్యాలయంలో ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాన్ని కేర్ ఆస్పత్రి సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ బ్యాంకు ఖాతాదారులకు ఎలా సేవలు అందిస్తామో సామాజిక సేవా కార్యక్రమాలను అలాగే నిర్వహించాలనే ఆలోచన చేశామన్నారు. కేంద్ర ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న సేవలను స్ఫూర్తిగా తీసుకుని , ఎస్‌బీఐ తరఫు/న మహిళా దినోత్సవ వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ ఎంఆర్ దత్తా, డిప్యూటీ మేనేజర్ పి.విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



మరమ్మతులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు

పార్వతీపురంటౌన్: పట్టణంలోని తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం పార్వతీపురం బూస్టర్ పంప్‌హౌస్ వద్ద జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మున్సిపాల్టీ పరిధిలో ప్రతిరోజూ ప్రజలకు తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. తాగునీటికి సమస్య ఎక్కడ వచ్చిన తక్షణం తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

మహిళలకు అండగా చట్టాలను బలోపేతం చేయాలి



సాలూరులో నిర్వహిస్తున్న ర్యాలీ

సాలూరు: మహిళలకు అండగా ప్రభుత్వాలు నిలుస్తూ చట్టాలను మరింత బలోపేతం చేయాలని స్ఫూర్తి మహిళా మండలి డైరెక్టర్ బలగ రాధ కోరారు. అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా స్ఫూర్తి మహిళా మండలి ఆధ్వర్యంలో శుక్రవారం సాలూరు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రస్తుతం సమాజంలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు, దాడులు, వేధింపులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలకు ప్రభుత్వాలు రక్షణ కల్పించాలని కోరారు. తప్పు చేసిన నిందితులను కఠినంగా శిక్షించేలా చట్టాలను మరింత బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో మహిళామండలి సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యాయులకు సన్మానం



గుడివాడ కాలనీ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను సన్మానించిన ఎంటీఎస్ ఉపాధ్యాయుడు

బలిజిపేట: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పలు పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ మేరకు మిర్తివలస డీపీఈపీ, మిర్తివలస రెగ్యులర్ పాఠశాల, సుభద్ర ప్రాథమిక పాఠశాలతో సహా పలు పాఠశాలల్లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా పలగర పంచాయతీ గుడివాడ కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఇద్దరు మహిళా ఉపాధ్యాయులను అదే పాఠశాలలో పనిచేస్తున్న ఎంటీఎస్ ఉపాధ్యాయుడు ఎ.పరిశినాయుడు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులు మాట్లాడుతూ స్త్రీని గౌరవించే సంప్రదాయం ఎంతో విలువైనదన్నారు. కార్యక్రమంలో ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వర్ణ ఆంధ్ర సర్వే శతశాతం జరిపించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో స్వరూపారాణి

మక్కువ: స్వర్ణఆంధ్ర ఫేజ్-4 సర్వే శతశాతం జరిపించాలని మండల ప్రత్యేకాధికారి వి.తిరుపతయ్య అన్నారు. ఈ మేరకు స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన సచివాలయాల ఉద్యోగులకు స్వర్ణ ఆంధ్ర సర్వేపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 8నుంచి, 13వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో స్వర్ణ ఆంధ్ర సర్వే పక్కాగా జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. విధుల్లో అలసత్వం వహించరాదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో డీడీ స్వరూపారాణి, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు చర్యలు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న డా.రవిచంద్ర

పార్వతీపురం రూరల్: ప్రాథమిక దశనుంచే రక్తహీనత నివారణకు చర్యలు తీసుకోవాలని పార్వతీపురం ఎంపీడీఓ జీవీ రమణమూర్తి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో రక్తహీనత నివారణ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆశావర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, మహిళా పోలీసులు సమన్వయంతో ఇంటింటి సర్వే నిర్వహించి రక్తహీనతకు గురైన వారిని ప్రాథమికంగానే గుర్తించాలని, వారికి అవసరమైన పోషక పదార్థాలను అందించడంతో పాటు సక్రమంగా వినియోస్తున్నారో లేదో పర్యవేక్షణ చేయాల్సిన బాధ్యత కమిటీ సభ్యులదేనని స్పష్టం చేశారు. సమావేశంలో సీడీపీఓ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలు కేంద్రాల్లో ప్రాథమిక దశనుంచే రక్తహీనతతో బాధపడేవారిని గుర్తించి పోషక పదార్థాలు అందించేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు.

పార్వతీపురం అర్బన్ హెల్త్‌సెంటర్ వైద్యుడు రవిచంద్ర మాట్లాడుతూ ఆస్పత్రి సిబ్బందితో గర్భిణులు, బాలింతలకు ఎప్పటికప్పుడు హెచ్‌బీ పరీక్షలను నిర్వహించి అవసరమైన పోషక పదార్థాలు, మందులను అందించేలా చర్యలు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం సన్నిబాబు, వైద్యసిబ్బంది, మహిళా పోలీసులు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లోకి తీసుకోవాలి



కరపత్రాన్ని విడుదల చేసిన సీఐటీయూ నాయకులు

పార్వతీపురం: రాజకీయ కక్షలతో తొలగించిన వివిధ శాఖల్లోని చిరుద్యోగులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తూ కరపత్రాలను విడుదల చేశారు. ఈ మేరకు శుక్రవారం పార్వతీపురంలో గల సుందరయ్య భవనంలో సీఐటీయూ ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు మాట్లాడుతూ ఇటీవల కాలంలో మన్యం జిల్లాలో చిరు ఉద్యోగస్థుల పైన రాజకీయ కక్ష సాధించేందుకు తొలగించిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10న కలెక్టరేట్ వద్ద ధర్నాకు సిద్ధమవుతున్నట్లు స్పష్టం చేశారు. మధ్యాహ్న భోజనం, వీఓఏ, ఫీల్డ్ అసిస్టెంట్లు, డైలీవేజ్ సిబ్బంది, వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ప్రధానమైన డిమాండ్‌గా ధర్నాకు సిద్ధమవుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డి.రమణారావు, గొర్లి వెంకటరమణ, సూరిబాబు, తులసి, రాజు, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చితే సహించేది లేదు



మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

పార్వతీపురం: బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చితే సహించేది లేదని ఐక్య ఆదివాసీ గిరిజన సంఘాల కార్యాచరణ సమితి సభ్యులు దుక్క సీతారాం, ఆరిక చంద్రశేఖర్, కోలక గౌరమ్మ, ఇంటి కుప్పల రామకృష్ణలు పేర్కొన్నారు. ఈ మేరకు వారు శుక్రవారం ఐటీడీఏ కార్యాలయం ప్రాంగణంలో మాట్లాడుతూ పుటపర్తి శాసన సభ్యురాలు పల్లె సింధూర రెడ్డి బోయ వాల్మీకులను ఎస్టీలో చేర్చాలని శాసనసభలో చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా వ్యతిరేకించారు. గిరిజన జాబితాలో ఉన్న ఆదివాసులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. అభివృద్ధి చెందిన బోయి వాల్మీకులు రాష్ట్రంలో 45లక్షల జనాభా ఉన్నారని, బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడం వల్ల నిజమైన ఆదివాసీలకు తీవ్రంగా నష్టం జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరిస్తే జేఏసీ ఆధ్వర్యంలో తీవ్రమైన ఆందోళన, నిరసన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు.

మక్కువ చేరుకున్న వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు



గ్రామానికి చేరుకున్న విగ్రహాలు

మక్కువ: మక్కువ–చెముడు రహదారి మధ్య నిర్మిస్తున్న శ్రీ వేంకటేశ్వర స్వామి, మరకతలింగ శివాలయాల్లో ప్రతిష్ఠాపనకు అవసరమైన దేవతామూర్తుల విగ్రహాలు శుక్రవారం మక్కువ చేరుకున్నాయి. ఆలయ కమిటీ సభ్యులు దేవతామూర్తి విగ్రహాలను మహాబలేశ్వరంలో కొనుగోలుచేసి తీసుకువచ్చారు. స్థానిక మజ్జిగౌరమ్మ ఆలయంలో దేవతామూర్తుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, అక్కడినుంచి మంగళ వాయిద్యాలు, కోలాటం, భక్తుల జయజయ ధ్వానాల నడుమ ఆలయం వద్దకు తీసుకువచ్చారు. విగ్రహాలను ప్రతిష్ఠించేంతవరకు ధాన్యాధివాసంలో ఉంచారు. ధాన్యాన్ని తీసుకువచ్చిన భక్తులకు గోత్ర నామాలతో పూజలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి. రంగునాయుడు, స్థానిక టీడీపీ నాయకులు మావుడి.ప్రసాదరావు నాయుడు, డాక్టర్ పి.మల్లేశ్వరరావు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



కోలాటం నిర్వహిస్తున్న మహిళలు